(9)

# సుడిగాలిలోని దీపం

రచన :
శ్రీమతి ఆర్. వసంత

రాత్రిసమయం కారుచీకటిగా వుంది. ఆ చీకట్లో రైలు రాక్షసిలాగ అరుస్తూ, వేగంగా వెళ్ళసాగింది. రాధ రైలుపెట్టెలోని గాజు కిటికీ తలుపులువేసి అందునుండి దూరంగా కనుపించే ప్రదేశాలను చూడసాగింది.

రైలు వేగంగా వెళ్ళుతూవుండడంవలన, చీకటిలో దూరాన కనుపించే దీపాలు, మిణుగురుపురుగువలె ఆరి ఆరి కనుపించసాగింది రాధకు. అలా చూస్తూవున్ననూ మనసు మాత్రము, తన తండ్రినే తలచుకొంటూ వున్నందువలన; అక్కడకు వెళ్ళింది.

'భగవంతుడా ! నాన్నకు ఏమి గాకూడదు. ఆయన నేను వెళ్ళేలోగా హాయిగా ఆరోగ్యంగా వుండాలి. వారికి ఏకష్టం కలుగకూడదు. నాతండ్రిని నానుండి వేరు చేయకు. అని మనసులోనే ప్రార్థిస్తూ, తనకు తెలియకుండా చేతు లెత్తి భగవంతునికి నమస్కరించింది రాధ.

అలాగ చీకట్లో అద్దాలనుండి ఎంతసేపు చూస్తూవుంటూ, ఆలోచిస్తూ వుండిందో రాధకే తెలియదు. అలాగ చూస్తూ, చూస్తూ కూర్చుని నిదురపోసాగింది.

వెంటనే కండ్లు తెరచిచూడగా, తెల్లవారింది. సూర్యుడు అప్పుడే భూమిలోననుండి తూర్పున ఉదయిస్తూ తన వేడి కిరణాలు వెదజల్లడానికి ప్రయత్నించసాగాడు. ఎండా కాలము కావడంవలన కంపార్టుమెంటులోకూడా, గాలి లేకుండా చెమటలు పట్టసాగింది.

రైలు విజయవాడ పరిసరప్రాంతంలో వెళ్ళసాగింది. రాధ తన వాచికేసిచూసి 'ఉదయం 7-10 నిమిషాలు కావస్తుందే' అని గబగబ టూత్‌పేస్టు బ్రష్ తీసుకొని కంపార్టుమెంటు డ్రస్సింగ్‌రూములో వెళ్ళి కాలకృత్యాలు పూర్తి చేసుకొని, ముస్తాబై తనసీటుతో కూర్చొన్నది.

రామాపురం రావడానికి, యింకా రెండుస్టేషన్లు వుం దనగా, పెట్టె, బెడ్డు సర్ది రెడీగా వుండసాగింది రాధ. రైలుయింజను రాక్షసిలాగ అరుస్తూ రామాపురం స్టేషన్‌లో ఆగగానే, రాధ తన సూట్‌కేస్, బెడ్డుతో స్టేషన్‌లో దిగింది.

తనను పెంచిన తాత 'రండమ్మ రండి' అని పెట్టె, బెడ్డు తీసుకొని బయలుదేరాడు. రాధ టికెట్టుయిచ్చి తాత వెనకాల వెళ్ళింది. రైలుస్టేషన్ బయటవున్న రెండెడ్ల బండిలో సామాన్లు వుంచి, 'ఎక్కండమ్మా' అన్నాడు. రాధ ఆతురతతో 'తాత ! నాన్నగారు ఎలా వున్నారు' అని అడగ్గా.—

తాత:-'నాన్నకు ఏమి ఫరవాలేదమ్మ' మనసు బాగుండ లేక అలా అయిపోయారమ్మ ! ఎప్పుడూ నీమీదేనమ్మ పంచప్రాణాలు వుంచుకొన్నారు. అని వస్తున్న కన్నీళ్ళు తుడుచుకొంటూ 'ఎక్కండి త్వరగా నాన్నను చూడటానికి వెళ్ళుదురు ఎక్కండి' అని బండి ముందరకు వెళ్ళాడు. రాధ బాధతో బండిలో ఎక్కి కూర్చొన్నది పాపం.

రెండెడ్లబండి మెల్లగా నడుస్తూవుంటే రాధ మనసు ఆరాటపడ సాగింది. 'తాత ! బండి త్వరగా పోనియ్యి' అని అనసాగింది. రాధ చెప్పినట్లు తాతకూడ ఎడ్లను పొడిచి, కర్రతో పొడిచి నడిపిస్తేనూ, ఎంతగా పరుగెత్తి తేనూ, బండి రాధమనసులో మెల్లగా వెళుతున్నట్లు వుండ సాగింది.

ఇంటిముందర బండి ఆగగానే, త్వరగా దిగి నాన్న కోసం, పరుగెత్తి లోన వెళుతూ, 'నాన్నా ! నాన్నా ! అంటూ మేడమెట్లు ఎక్కి రూములోకి వెళ్ళింది.

మంచంమీద దశరథరావునుచూచి 'ఇతను తన తండ్రి యేనా ?' అని మనసులోనే సందేహించసాగింది. పెరిగిన గడ్డం, ఎముకలగూడులాంటి శరీరం, కండ్లు ఎక్కడో లోనకు వెళ్ళిపోయింది. ఆ దృశ్యంచూచి, పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక బోరున ఏడుస్తూ.—

'నాన్నా ! యిటు చూడండి నాన్న, మీరాధ వచ్చింది, కండ్లుతెరచి చూడండి. అని రాధ అంటూవుంటే.—

దశరథరావు ఆమాటలు ఎక్కడనో విన్నవాడిలాగ, బాధగా కండ్లు తెరచిచూచి, తనబలాన్ని; శక్తిని కూడ కట్టుకొని లేస్తూ, 'వచ్చావమ్మా ? అని రాధను కౌగలించు కొంటూ, 'ఈజన్మలో నిన్ను చూచేభాగ్యం కలుగకుండా పోతుందేమో అని భయపడ్డానమ్మ' అన్నాడు.

రాధ ఏడుస్తూ కౌగళినుండి తన తండ్రిని చేరదీసి ఆప్యాయతతో 'అలా అనకండి నాన్న ! అమ్మ పోయిన నాటినుండి, అమ్మ అనేమాట తెలియనీయకుండా అమ్మ గాను, నాన్నగాను మీరు నాకు ఏకష్టము కలుగకుండా కాపాడారు. మీరే నా జీవితానికి తల్లి, తండ్రి, గురువు.

దైవం అంతా మీరే. మీరు లేకపోతే నేను బ్రతుకలేను నాన్న, అని తండ్రిఒడిలో తలవుంచి, బోరున ఏడ్వ సాగింది.

దశరథరావు రాధ తలను ప్రేమతో నిమురుతూ, 'నేను వట్టి మూర్ఖుణ్ణి. నీ ఆశకు అనుగుణంగా నీబావ రవితో పెండ్లి చేయలేదు. నేను చూచినవాడితో నీ పెండ్లి జరిపించి నందుకు భగవంతుడు నాకు తగిన గుణపాఠం నేర్పా డమ్మా, నా పాపానికి దండనగా నీజీవితం ఎందుకూ పనికి రాకుండాపోయింది. అటూ నాచెల్లెలు బాధతో యీలోకాన్ని వదలి శాశ్వతంగా వెళ్ళిపోయింది అన్నాడు.

ఆమాటకు రాధ నాన్న ఒడిలోనుండి తల పైకెత్తి ఆశ్చర్యంతో, 'అత్తయ్య వెళ్ళిపోయిందా ?' అని ఏడుస్తూ 'అత్తయ్యా నన్ను క్షమించు. నావల్లనేకదా నీకు యింతటి కష్టంవచ్చి, నన్ను చూడకూడదని వెళ్ళిపోయావా ? అని కంటికి మింటికి ధారగా ఏడ్వసాగింది.

దశరథరావు బాధగా శ్వాసంపీలుస్తూ, 'నాయనా రవి ! అని పిలిచాడు. దూరంగా మూలలో నిలబడివున్న రవి దగ్గరకు వచ్చాడు. అంతవరకు తన బావ రవి అక్కడ వున్నట్లు అనుకోలేదు పాపం రాధ.

దగ్గరకు వచ్చిన రవి చేతులుపట్టుకొని దశరథరావు, 'బాబు రవి ! నీవు చదువుకొన్నవాడివి. మంచి ఏదో, చెడు ఏదో తెలిసినవాడివి. నేనూ, నా అభిమానం అంటూ ప్రాకు లాడి, తుదకు నేను తీసుకొన్న గోతిలో నేనే పడిపోయా ను. భగవంతుడు తగినబుద్ధి చెప్పాడు. అందువలన నా ముద్దుల కూతురి సంసారం నాశనమైపోయింది. నన్ను క్షమిస్తావుకదూ, అని చెప్పలేక ఏడ్వసాగాడు.

రవి వస్తున్న దుఃఖాన్ని లోలోన దిగమ్రింగుకొంటూ 'అంతటిమాట అనకు మామయ్య. నీవు కావాలని చేయ లేదుకదా , యిది అంతా నా దురదృష్టం' అని వాపోయాడు.

రవి తండ్రి భూషయ్యను పిలచి అతనిచేతులు తన దగ్గరకు తీసుకొని, 'బావా ! నీవుకూడా నన్ను క్షమించాలి నావలననేకదా నీ భార్యఅయిన నా చెల్లెలు నిన్ను నన్ను వదలి శాశ్వతంగా వెళ్ళిపోయింది - అని ఏడుస్తూ దశరథ రావు అంటూ వుంటే.—

రవి తండ్రి భూషయ్య కన్నీళ్ళు తుడుచుకొంటూ. అంతటిమాట అనకు బావ ! నా విధివ్రాత అంతే అనుకొం టాను. లేకపోతే నీచెల్లెలు నన్నువదలి సుమంగళిగా వెళ్ళే భాగ్యం ఎవరికి కలుగుతుంది. అని ఆపైన చెప్పలేక లో లోన ఏడుస్తు కండ్లు మూసుకొన్నాడు. ఆ హృదయములో నుండి ఆవేదన కన్నీరురూపంలో నాలుగుచుక్కలు చొట చొట దశరథరావు చేతిమీద పడింది.

దశరథరావుకు అక్కడి పరిస్థితులు, హృదయవిదారక మైన బాధనుచూచి మనసులోని మాటలు నియము రాలేదు. బలవంతాన శక్తినంతా కూడగట్టుకొని కన్నీళ్ళు తుడుచు కొంటూ, 'అమ్మా రాధ ! ఇన్నాళ్ళు నేనుండి నీ కష్టసుఖా లను చూశానమ్మా. యికమీదట తండ్రి అయినా, మామ య్య అయినా యితనేనమ్మ అని, రవివైపుతిరిగి, 'నాయనా రవి ! నా ఆస్తి, ఈ ఐశ్వర్యం అంతా నీచేతులో పెడు తున్నాను. రాధ జీవితమే అడవిన కాచిన వెన్నెలగా అయి పోయింది. రాధనుకూడ నీచేతులో వుంచుతున్నాను. ఇక మీదట నీకు ఏది సరిఅని తలుస్తావో, రాధకు చెయ్యి...అని అంటూ రాధచేతిని రవిచేతిలో వుంచాడు.

రాధ ఏడుస్తూ అంతటిమాటలు అనకండి నాన్న. మీరు లేనిదే నేను బ్రతుకలేను . అని అంటూవుండగా, 'పిచ్చి దానా ! నావలన నీకు ఏమంచి జరుగలేదుకదామ్మా ! యిక నైనా నీవు బావవలన సంతోషంగా వుండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. నాప్రాణం పోతేనూ, నీవెంట ఎల్లప్పుడూ వుంటాను. అని ఆప్యాయంగా రాధఒడిలో తల వుంచు కొని మెల్లగా కన్ను మూశాడు.

రాధ ఏడుస్తూ నాన్న తల ఎత్తిచూచి, 'నాన్నా ! అని అరుస్తూ, తన తండ్రిని కౌగలించుకొని గుండెలు కరిగే విధంగా ఏడ్వసాగింది. రవి, భూషయ్య బాధగా ఏడ్చారు, విలపించారు.

కాని, ఎంతమంది ఏడ్చినను, ఏమి లాభం. ఇక యీ లోకంతో పనిలేకుండా శాశ్వతంగా వెళ్ళిపోయాడు దశరథ రావు.

(ఇంకా వుంది.)

